# చలిజ్వరం

వెంకటరావూ, రామమూర్తీ దెబ్బలాడుకున్నారనీ, వెంకటరావు, రామమూర్తిని దిట్టంగాబాది వదలిపెట్టాడనీ నాకు ఆనోటా, ఆనోటా తెలిసింది. ఎవరూ సరిఅయిన వర్తమానం మాత్రము చెప్పలేదు. వెంకటరావు చాలా సరదామనిషి; సాధారణంగా. యెవరినీ మనసు నొప్పించేవాడు కాదు. అలాటివాడు రామమూర్తిమీద చెయ్యిచేసుకున్నాడంటే, నాకు ఆశ్చర్యం కలగకపోలేదు.

ఇక, రామమూర్తి వొట్టినాప. ఒకరికి కోపము తెప్పించేటంత సమర్థతా, తెలివితేటలూకూడా అతడికి లేవు.

ఒకటి పాలు, ఒకటి నీళ్ళు. ఈ రెండిటి మధ్యనూ అగ్నిహోత్రము ప్రజ్వరిల్లింది.

దెబ్బలుకొట్టిన వెంకటరావుని, 'ఏమిట్రా, ఆ పిచ్చి వెధవమీద చెయ్యి చేసుకున్నావుటా ?' అని అడిగాను.

“ఇంకానయం, బ్రతికిపోయాడు వెధవ. నిలువునా చీల్చి యెండ వేసే వాడిని, పొగరుబోతు గాడిదకొడుకు” అంటూ మళ్ళీ రుద్రావతార ఘట్టము లోకి దిగాడు.

ఏదో తీవ్రమైన కారణంలేనిదే, వెంకటరావు కళ్లు అలా నిప్పులు రాలుస్తాయా! కాని, అంతకోపము తెప్పించేటంత అపరాధము, ఆ పిచ్చి రామ్మూర్తి యేమి చేసివుంటాడు ?

ఎంతసేపు, ఎన్నివిధాల ప్రశ్నించినా వెంకటరావు రామ్మూర్తి మళ్లీ కనపడితే, ప్రేగులు త్రెంపి మెళ్ళో వేసుకుంటాననడమేకాని, అంత ప్రళయ తాండవానికి హేతువేమిటో చెప్పాడుకాడు.

ఇక రామ్మూర్తిని అడిగితే—వాడూ యింతే; ఎంతసేపూ, 'దుష్టువెధవ, దుష్టువెధవ, రౌరవాదినరకాలకిపోతాడు. పాపిష్టివెధవ,' అనడముతప్ప, అసలు కథకి సూచనమాత్రమైన అందింపుకూడా యిచ్చాడుకాడు.

పైచెయ్యిలో వున్నాడు గనుక, ఎలాగయినా అసలు సంగతి, వెంకటరావుద్వారానే తెలుసుకోవచ్చునని ఆశకలిగింది. ఒకసారికి రెండుసార్లు బలవంతపెడితే, మొహమాటంమీదనైనా సంగతి చెపుతాడని అనిపించింది. కథ యేమిటో పూర్తిగా తెలుసుకుంటేనేగాని, నాకు మరోకపని తోచేటట్టులేదు.

మళ్ళీ వెంకటరావు దగ్గరికి వెళ్ళాను.

అదేగొడవ, కాస్త ప్రస్తావనలోకి దింపగానే, "నీకు యెందుకింత రంధి?" అనేశాడు, వాడు.

"అదికాదురా, యిద్దరూ నాకు స్నేహితులే. ఏ కారణముచేత మీకు యీ తగాదావచ్చిందో తెలిస్తే, మీ యిద్దరికీ యిక పొసుగుతుందో పొసగదో తెలుసుకోవచ్చును చూడు," అన్నాను.

"పొసగడమేమిటి. ఈసారి ఆ వెధవమొహం నాకు కనిపించిందంటే, నా యెడంకాలి చెప్పుకీ, వాడి వెధవ మొహానికీ పొసుగుతుంది." అన్నాడు, వెంకటరావు.

"అసలు సంగతేమిటో చెప్పరా" అని కొంచెం లాలనగా అడిగాను.

"ఏదో కొంపమునిగిపోయినట్టు, దేవులాడుతున్నావు కనుక, చెపుతాను విను. ఆ వెధవ, మొన్న ఉదయము నాకు మార్కెటులో కనిపించాడు. ఎందుకో, ఆ వెధవమొహం, మామూలుకంటె మరికాస్త వెధవరికం వోడుతూ వుంది. ఎందుకురా అలావున్నవ్ అన్నాను. చలిజ్వరం వస్తోందన్నాడు. డాక్టరు దగ్గరికి వస్తున్నానన్నాడు.

"కాస్త నవ్వుతాలుగా, ఖులాసాగా మాట్లాడేతత్వంకదూ, నాది! ఆ మాటా యీమాటా మాట్లాడి, ఏం మందు తీసుకుంటున్నావని అడిగి, ఓ చిన్న ఆయుర్వేదపు చిటకావుందిరా అన్నాను. జ్వరం తగ్గినా, తగ్గక పోయినా, అసలు జర్వం తగిలేటప్పుడు వచ్చే చలి కుదుపు భరించరానంతగా వుంటుందని యేడిచాడులే, అంచేత నాకొక ఆయుర్వేద వైద్యుడు చెప్పిన చిటకా చెపుదామనుకున్నాను. ఆ వెధవకి మర్యాద తెలిస్తేగా.

"నేను చెప్పిన చిటకా ప్రకారము, చేస్తానన్నాడు. చలికుదుపు యెక్కువ అయినప్పుడు, నీభార్యను దగ్గరికి పిలిచి, గట్టిగా కౌగలించుకుంటే, కుదుపు తగ్గుతుందని ఆ వైద్యుడు చెప్పాడూ, నేను అలాగే చేశానూ, నాకు నిజంగానే తగ్గింది అని చెప్పాను; అప్పుడు ఆ ఛండాలపు వెధవ ఏమన్నాడో తెలుసా?' అని అడిగాడు వెంకటరావు.

'నాకు తెలియదు. ఏమన్నాడేమిటి' అన్నాను.

"ఏమన్నాడా? నీభార్య యిప్పుడు ఇంట్లో వుంటుందా అని అడిగాడు, దొంగగాడిదకొడుకు: అలాటివాణ్ణి నిలువునా చీల్చిపార వెయ్యవద్దూ" అంటూ నా మొహంచూశాడు.

నవ్వితే వెంకటరావుకి కోపమువస్తుంది. నవ్వకపోతే ప్రాణం వుక్కిరి బిక్కిరి అయేటట్టుంది. ఏం చెయ్యడానికీతోచక దగ్గుతెచ్చుకొని పేగులు వుండచుట్టుకునే దాకా దగ్గి, చచ్చిచెడి చేయంగల విన్నపములై యింటికి చేరాను.

# లేడీ డాక్టరు

'నువ్వు కొత్తగా ట్రెయినింగు అయివచ్చావా' అని ఎదుట నిలుచున్న నర్సును అడిగింది డాక్టరు లీల.

'అవునమ్మా' అని వినయంగా జవాబు చెప్పింది నర్సు.

'నీ పేరు?'

'కృపావతి'

'నిన్ను ఎవరు రికమెండు చేశారు?'

'ఎవరూ రికమెండు చెయ్యలేదు. పెద్ద డాక్టరమ్మగారిని మా నాన్న అడిగాడు. డాక్టరమ్మగారు ఆర్డరువేశారు.'

'అయితే-' అని మాట సంగంలోనే యేదోపని వున్నట్లు వెళ్లిపోయింది. డాక్టరు లీల. కృపావతి మందు సీసాలు అలమారులో సవరిస్తూ క్రొత్త వుద్యోగంమీద ఉండే శ్రద్ధను కనుపరుస్తోంది.